ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



కాకినాడ
జిల్లా వార్తలు

మంగళవారం 17 సెప్టెంబరు 2024 | 5


శంఖవరం మండలం కత్తిపూడిలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం

కాకినాడ రూరల్ ప్రాంతంలోని కొవ్వాడలో అనధికార లేఅవుట్



అక్రమ లేఅవుట్లు.. అడ్డగోలుగా..

- రియల్ ఎస్టేట్ వెంచర్లలో నిబంధనలకు పాతర
- ఎకరానికి రూ.లక్షల్లో ముట్టచెపుతున్న వైనం
- ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే రియల్టర్ల దందా
- చోద్యం చూస్తున్న అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 16: జిల్లాలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. వ్యవసాయ భూముల్లో ఎటువంటి కన్వర్షన్ లేకుండా నగరపాలక సంస్థలు, పంచాయతీలనుంచి అనుమతులు తీసుకోకుండానే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేస్తున్నారు. కాలువలు, వాగులు, ప్రభుత్వం భూములు, అసైన్డ్ స్థలాలు కబ్జాకు గురవుతున్నా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడంలేదు. కాస్తంత ఖాళీ జాగా కనపడిందంటే చాలు రాత్రికి రాత్రే చదును చేసి లేఅవుట్లు వేసి అమ్ముతున్నారు. రియల్ వెంచర్లలో నిబంధనలు పాటించడంలేదు.

పంట భూములను నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా చేసిన తర్వాత డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అనుమతి తీసుకోవాలి. వీటిని సదరు పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. 30 అడుగుల రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. వాటర్ ట్యాంక్, పార్కు తదితర సౌకర్యాలు కల్పించిన తరువాతే ప్లాట్లుగా విక్రయించాలి. లేఅవుట్లలో పదిశాతం భూమిని పురపాలక సంఘానికి అప్పగించాలి. పంచాయతీల్లో అయితే ఎకరం స్థలంలో ఐదుశాతం భూమిని ప్రభుత్వానికి ఇవ్వాలి.

నిబంధనలు పట్టవా?

కాకినాడ జిల్లాలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) పరిధిలోని పలు ప్రాంతాల్లో అడ్డగోలుగా అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. వ్యవసాయ భూములు ఎటువంటి కన్వర్షన్ లేకుండా సీఆర్డీఏ, నగరపాలక సంస్థల నుంచి అనుమతులు తీసుకోకుండానే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేస్తున్నారు. కొందరు అధికార పార్టీ నేతల అండదండలతో అనధికార వెంచర్లు వేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కాకినాడ సిటీ ప్రాంతంలో స్థలాల కొరత ఉండడంతో నగరానికి అనుకుని రూరల్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ దందా ఊపందుకుంది. ఈప్లాట్లు చదరపు గజం రూ.15వేల నుంచి రూ.20వేల లోపు విక్రయిస్తుండడంతో కొనుగోలు చేసేందుకు అత్యధికశాతం మంది ఆసక్తి చూపుతున్నారు. అధికారులకు అక్రమ లేఅవుట్ల వ్యవహారం తెలిసినా చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ లేఅవుట్లతో ఆయా పరిధిలోని నగరపాలకసంస్థ, సీఆర్డీఏ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది.

అనుమతులు తప్పనిసరైనా..

రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎడాపెడా పంట భూములను నివేశన స్థలాలుగా మార్చి విక్రయిస్తున్నారు. ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలన్న లేఅవుట్లు వేయాలన్న తప్పనిసరిగా సీఆర్డీఏ అనుమతితోపాటు టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు తప్పనిసరి. కానీ అధికార పార్టీల అండ ఉంటే చాలు నిబంధనలతో పని లేదనే చందంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతోంది. ఆరోపణలు వెల్లువెత్తిన ప్రతిసారి సీఆర్డీఏ అధికారులు వచ్చి వెంచర్లవద్ద అక్రమ లేఅవుట్లు అని తాత్కాలిక బ్యానర్లు ఏర్పాటు చేసి వెళ్లిపోతున్నారు. సీఆర్డీఏ అధికారులు వెళ్లిన తర్వాత రియల్టర్లు బ్యానర్లను తొలగించి యథేచ్ఛగా క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి నారాయణ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టి కల్పించడానికి అనధికార లేఅవుట్‌లను గుర్తించి వాటి ని నిలిపివేయాలన్న ఉద్ధేశంతో అధికారులు సర్వే నిర్వహించారు.

జిల్లావ్యాప్తంగా ఈ ప్రాంతాల్లో..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లస్థలాల లేఅవుట్లు వేస్తున్నారు. పట్టణశివారు గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంట జగనన్నకాలనీల సమీపంలోను లేఅవుట్లు వెలిశాయి. కాకినాడ రూరల్ ప్రాంతంలో గంగనాపల్లి, కొవ్వాడ, చీడిగా, మేడలైన్, తూరంగి ప్రాంతాల్లో 23 లేఅవుట్లు వేశారు. నిబంధనలు తెలియని వినియోగదారులు వాటిని కొని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు మామూళ్లు అందుకుని లేఅవుట్లను చూసీచూడకుండా వదిలేయడంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. పెద్దాపురం మండలంలో జి.రాగంపేట, కిర్లంపూడిలో సోమవరం, శంఖవరంలో ఎ.అన్నవరం, నెల్లిపూడి, గొల్లప్రోలులో చేబ్రోలు, యు.కొత్తపల్లిలో కుతకుడుమిల్లి, జగ్గంపేటలో మల్లిశాల, గండేపల్లిలో నీలాద్రిరావుపేట, సామర్లకోట పట్టణ పరిధిలో పనసపాడు, పెదపూడి మండలంలో ఏపీ త్రయం ప్రాంతాల్లో అధికారుల లెక్కల ప్రకారం 42 అనధికారిక లేఅవుట్లలో వ్యాపారాలు జరుగుతున్నాయి. లెక్కకు రాని లేఅవుట్లు మరో 20 నుంచి 30 వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

చర్యలు చేపడుతున్నాం: కౌడా వైస్ చైర్మన్ కృష్ణమూర్తి

కౌడా పరిధిలో 42 అనధికార అవుట్‌లెట్లను గుర్తించాం. వాటిపై తగిన చట్టపరమైన చర్యలు చేపడుతున్నాం. గుర్తించిన అనధికార లేఅవుట్లలో బోర్డులు ఏర్పాటు చేయడంతో లేఅవుట్‌దారులు దరఖాస్తు చేసుకోవడానికి ముందుకొస్తున్నారు. అనధికార లేఅవుట్లు కొని ప్రజలు మోసపోవద్దు.


కాకినాడ రూరల్‌లోని ఎన్టీఆర్ బీచ్‌లో..


తాళ్లరేవు మండలం గోవలంకరేవులో ..

'గణనాథుడి'కి ఘన వీడ్కోలు!

జిల్లావ్యాప్తంగా గణనాథుడి నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. వినాయక చవితి తర్వాత నవరాత్రులు ముగియడంతో ఆయా ప్రాంతాల్లో నిలబెట్టిన వినాయక విగ్రహాలను స్థానిక కమిటీల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకెళ్లి సోమవారం నిమజ్జనం చేశారు. కాగా, తునిలో వినాయక నిమజ్జనోత్సవంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తూ తాండవ నదిలో మునిగి మృతి చెందాడు.


రత్నగిరి గణనాథుడిని పంపా రిజర్వాయర్‌లో నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఆలయ సిబ్బంది

రత్నగిరిపై సంప్రదాయబద్ధంగా గణనాథుడి నిమజ్జనం

అన్నవరం, సెప్టెంబరు 16: అన్నవరంలో పంపా రిజర్వాయర్‌లో గణనాథుడి నిమజ్జనోత్సవం నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు రత్నగిరిపై ఏర్పాటు చేసిన మట్టి గణపతిని మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, కోటమర్తి సతీష్, ఏపీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు. రిజర్వాయర్‌లోకి ఎవరినీ అనుమతించకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం దగ్గరుండి ప్రత్యేక క్రేన్ సహాయంతో గజఈతగాళ్ల సాయంతో గణనాథులను పంపాలో నిమజ్జనం చేశారు.

తేలుతున్న వరద లెక్కలు

- జిల్లావ్యాప్తంగా వ్యవసాయ పంటల నష్టం.. 34వేల ఎకరాలు
- దెబ్బతిన్న గృహాలు 9వేలు.. యాప్‌లో అప్‌లోడ్ చేసిన సిబ్బంది


కిర్లంపూడి మండలంలోని పంటపొలాల్లో తగ్గని వరదనీరు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 16: జిల్లాలో వరద ముంపులో ఉన్న వ్యవసాయ పంటల లెక్కింపు నాలుగోరోజు సోమవారంతో దాదాపుగా ముగిసింది. వరదలవల్ల జిల్లాలో 34,812 ఎకరాల్లో వ్యవసాయ పంటలు నష్టం జరిగినట్లు యాప్‌లో అప్‌లోడ్ చేశారు. దీనిలో వరి పంట అధికంగా నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. మొక్కజొన్న, పత్తి, మినుము పంటలు కూడా ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా 13 మండలాల్లో 121 గ్రామాల్లో పంట నష్టం లెక్కింపు జరిగింది. ఏలేరు, పంపా, తాండవ, గోదావరి నదులు వరదవల్ల 33శాతం పైగా పంటలకు నష్టం కల్గిన వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. నమోదైన వివరాలు అమరావతిలో ప్రభుత్వ పోర్టల్‌లోకి వెళ్లాయి. 34వేల ఎకరాలకు ఎకరానికి రూ.10వేల చొప్పున రూ.35కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ కావాలని ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎకరానికి రూ.6800 మాత్రమే ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఎకరానికి రూ.10వేల నష్టపరిహారం ఇవ్వడం కొంతవరకు రైతులకు ఊరట ఇస్తుందని అంటున్నారు. జిల్లాలో 9,211 గృహాలు పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్నట్లు యాప్‌లో అప్‌లోడ్ చేశారు. దీంతోపాటు ఉద్యానశాఖలో 80 ఎకరాలు నష్టం జరిగినట్లు యాప్‌లో నమోదు చేశారు. ఇతర శాఖలు కూడా పంట నష్టం లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. పంటనష్టం లెక్కింపు దాదాపుగా ముగిసిందని అధికారులు చెబుతున్నారు. ఈ నివేదికను కలెక్టర్ షాన్‌మోహన్‌కు మంగళవారం అందజేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో పంటనష్టం లెక్కింపు కార్యక్రమం అత్యంత పారదర్శకంగా నిర్వహించామన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

మిలాన్-ఉన్-నబీ వేడుకలు


మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా జగ్గంపేటలో మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

నేటినుంచి.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 16: ఈనెల 17 నుంచి కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు జరగనున్నాయి. స్వచ్ఛతా కీ భాగీదారీ విభాగంలో ప్రజల భాగస్వామ్యాన్ని, అవగాహనను ప్రోత్సహించడానికి మారథాన్‌లు, సైక్లోథాన్‌లు, మానవహారాలు నిర్వహిస్తారు. మొక్కల పెంపకం, సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. స్వచ్ఛతా లక్షిత్ ఏకాయి సంపూర్ణ స్వచ్ఛత విభాగంలో అధిక జనసాంద్రత కలిగిన ప్రదేశాల్లో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతూ పరిశుభ్రత లక్ష్యసాధనకోసం ప్రత్యేకించి ఒక ప్రాంతాన్ని లేదా పారిశుధ్య సమస్యను ఎంపిక చేసుకుని దానికి పరిష్కారాన్ని చూపుతారు. సఫాయి మిత్ర సురక్ష విభాగంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం, గౌరవాన్ని కాపాడేలా విభిన్న కార్యక్రమాలను చేపడతారు. ఆరోగ్య శిబిరాల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధికి ఏకగవాక్ష విధానాన్ని అమలు చేయడం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

పక్షంరోజులపాటు కార్యక్రమాలు

- స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఈనెల 17 నుంచి అక్టోబరు 1 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- 17న మానహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, వైద్యఆరోగ్యశాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 18న స్వచ్ఛతా పరుగులు, బ్లీచింగ్, దోమల నివారణ, మందుల పిచికారీ, నీరు నిలిచే ప్రదేశాలను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స శిక్షణ నిర్వహిస్తారు.
- 19న ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛతా కార్మికులను గుర్తించి మంజూరైన పథకాలతో అనుసంధానం చే స్తారు.
- 20న మొక్కల పెంపకం
- 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కులను శుభ్రపరచడం, పీపీఈ కిట్లు, సేఫ్టీగేర్లు పంపిణీ నిర్వహిస్తారు.
- 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాల్వలు, డ్రైన్లు శుభ్రపరచడం
- 23న వర్షపు నీటి నిల్వ నిర్మాణాలపై అవగాహన
- 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, నీటి నమూనా పరీక్షలు
- 25న వీధి నాటకాలు
- 26న అవాంఛిత యాప్లను క్లియర్ చేయడం
- 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ
- 28న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఆస్తుల సుందరీకరణ
- 29న చెత్తనుంచి సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన
- 30న మూలాల విభజన, రీసైక్లింగ్, కంపోస్టింగ్ ప్రదర్శనలు
- అక్టోబరు 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ హ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులకు సన్మానాలు చేపడతారు.

రేపు బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కాకినాడ అర్బన్, సెప్టెంబరు 16: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 18న కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి పీఎస్ సత్యనారాయణ తెలిపారు. ఈ ఎంపికకు హాజరయ్యేవారు 2010, సెప్టెంబరు 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని, వివిధ అర్హత ధ్రువపత్రాలతో ఉదయం 8 గంటలకు హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న ఏలేరు వరద

- ముందుజాగ్రత్త చర్యగా దిగువకు మిగులు జలాలు విడుదల
- వాయుగుండం హెచ్చరికలతో అధికారుల అప్రమత్తం


పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు కాలువలో వరద నీటి ఉధృతి

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 16: ఏలేరు వరద ఉధృతి కొనసాగుతోంది. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడనుందన్న సమాచారంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా మిగులు జలాలను దిగువకు విడుదలకు చేస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరకుండా ఉండేందుకు వీలుగా వరద జలాలు విడుదల కొనసాగిస్తున్నారు. ఇన్‌ఫ్లోస్ తగ్గినా మిగులు జలాల విడుదలను మాత్రం తగ్గించడం లేదు. బంగాళాఖాతంలో ఈనెల 23వతేదీ నాటికి వాయుగుండం ఏర్పడనుందన్న వాతావరణశాఖ సమాచారం నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందుగానే అప్రమత్తమైంది. వచ్చే దాళ్వా సీజన్, తాగునీటి అవసరాలు, విశాఖకు పంపే జలాలును దృష్టిలో ఉంచుకుని ఎంతవరకూ నీరు నిలువ ఉంచవచ్చు అనే అంశాన్ని పరిగణలోకి తీసుకుని మిగులు జలాలు విడుదల చేస్తున్నారు. ఏలేరు కాలువలకు భారీ వరదల కారణంగా కిర్లంపూడి, గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి సహా 8 మండలాల పరిధిలో భారీగా గండ్లు పడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఏలేరు నుంచి 5,875 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నప్పటికీ గండ్ల నుంచి నీరు పొలాల్లోకి చేరుతోంది. ఈ స్థాయిలో నీరు విడుదల చేస్తే కాలువల్లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండి అక్కడక్కడా గట్లు బలహీనంగా ఉన్న చోట్ల పొలాలు మునిగే అవకాశం ఉంది. వరదల కారణంగా పడిన గండ్లు, పలుచోట్ల గట్లు కోతకు గురికావడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ముంపు అధికంగా ఉంది. ఏలేరు ఆయకట్టు ప్రాంతంలో 2,800 ఎకరాల్లో వరి పొలాలు ఇంకా ముంపులో ఉండిపోయాయి. కొన్నిరోజులపాటు ఇదేస్థాయిలో వరద నీటి విడుదలను కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉధృతంగానే ఏలేరు కాలువలు

మిగులు జలాలు విడుదలతో పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లోని గొర్రిఖండి, నక్కలఖండి కాలువలతోపాటు అన్ని ప్రధాన కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నీటి విడుదలను వెయ్యి క్యూసెక్కుల మేర తగ్గిస్తే పొలాలు అన్ని ముంపులో నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయని రైతులు చెబుతున్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటిమట్టం 86.56మీటర్లు కాగా నీటి నిల్వ 24.11 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 85.63మీటర్ల ఎత్తున 22.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఏలేరు కాలువలకు 5వేల క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కులు జలాలు విడుదలవుతుండగా విశాఖ తాగునీటి అవసరాల నిమిత్తం 275 క్యూసెక్కులు పంపిస్తున్నారు. ఇన్‌ఫ్లోస్ మాత్రం 3134 క్యూసెక్కులకు తగ్గాయి.

కొనసాగుతున్న నష్టం అంచనాలు

ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా ముంపునకు గురైన పంట పొలాలకు జరిగిన నష్టాన్ని గ్రామాలవారీగా అంచనాలు వేస్తున్నారు. ప్రత్యేక యాప్‌లో పంటనష్టం వివరాలు నమోదు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలతోపాటు గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయం, పిఠాపురం వ్యవసాయశాఖ కార్యాలయంలో పంట నష్టం వివరాలను నమోదు చేస్తున్నారు. భూముల రీసర్వేలో విస్తీర్ణం, సర్వే నెంబర్లు, వివరాలు తప్పుగా పడిన వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. మరోవైపు ఈనెల 23వ తేదీ వరకూ ఈ క్రాప్ ద్వారా పంటల నమోదుకు అవకాశం ఉన్న నేపథ్యంలో నష్టం వివరాల నమోదుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

రేషన్‌షాపుల రేషనలైజేషన్‌కు సిద్ధం

- ఉత్తర్వులను వెలువరించిన ప్రభుత్వం
- డివిజన్ యూనిట్‌గా తీసుకుని రేషన్‌కార్డుల పంపకం
- దుకాణాల్లో సమానంగా ఉండే విధంగా చర్యలు
- ఈనెల 30వ తేదీలోపు షాపుల గుర్తింపు
- నవంబర్ 23 లోపు కేటాయింపులు
- జిల్లాలో 133 పాత షాపులకు నోటిఫికేషన్
- కొత్తగా మరో 240 షాపులకు అవకాశం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 16: జిల్లాలో రేషన్‌షాపుల రేషనలైజేషన్‌కు సర్వం సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను వెలువరించింది. దీనివల్ల ప్రతి ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో నిర్ధేశించిన మేరకే రేషన్‌కార్డులు ఉంటాయి. దీనిలో కొన్నిషాపుల్లో 1000 నుంచి 1500 రేషన్‌కార్డులున్నాయి. మరికొన్ని షాపుల్లో 600 నుంచి 700 రేషన్ కార్డులున్నాయి. దీనివల్ల ప్రభుత్వ చౌకధరల దుకాణాల డీలర్లకు వచ్చే కమీషన్‌లో తీవ్రంగా తేడా ఉంది. పైగా ఒక కిలోమీటర్ పరిధిలో ఏర్పాటు చేయాలని నిబంధన ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో పట్టణాల్లో గ్రామాల్లో ఉండే రేషన్‌షాపుల్లో రేషన్‌కార్డులను సమానంగా పంపకం చేయాలని ఆదేశించారు. ఈనెల 30లోపు పెరిగిన షాపులను గుర్తించాలని సూచించారు. నవంబరు 23వతేదీలోపు దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రతినెలా 1న నోటిఫికేషన్

జిల్లాలో 1060 దుకాణాలు ఉండగా దీనిలో 133 దుకాణాలు వివిధ కారణాలవల్ల డీలర్ల పోస్టులు ఖాళీ అయ్యాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలతో నడిపింది. వాటిని తక్షణమే నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించింది. రేషనలైజేషన్ నేపథ్యంలో జిల్లాలో మరో 240 షాపులు పుట్టుకొస్తున్నాయి. వీటిని కూడా నోటిఫికేషన్ ఇచ్చి కొత్తగా డీలర్లను నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎండీయూ వాహనాల వలన రేషన్ సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా తయారైంది. ఈ నేపథ్యంలో రేషన్‌దుకాణాలు పెంచి పారదర్శకంగా సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో 500 నుంచి 550 రేషన్ కార్డులు ఒక్కొక్క దుకాణంలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. కార్పొరేషన్‌ల్లో 600 నుంచి 650 కార్డులు ఉండేలా ఆదేశించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రేషన్‌దుకాణాల్లో కనీసం 400 కార్డులతో రేషన్‌దుకాణం ఉండేలా చూడాలని పేర్కొంది. 800 కంటే అధికంగా ఉన్న రేషన్ దుకాణాల్లో కార్డులను రేషనలైజేషన్ చేయాలని ఆదేశించింది. ప్రతినెలా 1న డీలర్ల నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని పేర్కొంది. 15న రాత పరీక్ష నిర్వహించి 16న మౌఖిక ఇంటర్వ్యూ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. డివిజన్ యూనిట్‌గా తీసుకుని రేషన్‌కార్డుల విభజన జరగాలని ఆదేశించింది.

ఆల్బెండోజోల్ మాత్రల పంపిణీకి చర్యలు

- జిల్లాలో 4,72,859 మంది విద్యార్థులకు పంపిణీ

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 16: రక్తహీనత నివారణకోసం జిల్లాలో 4,72,859 మంది విద్యార్థులకు ఆల్బెండోజోల్ టాబ్లెట్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు కాకినాడ సాంబమూర్తినగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలు వేసేలా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నులిపురుగుల కారణంగా విద్యార్థుల్లో పోషకాహారం లోపం, రక్తహీనత సమస్య ఉంటుందన్నారు. రక్తహీనతతో శారీరక, మానసిక అభివృద్ధిలో మందకొడిగా ఉంటూ తొందరగా అలసిపోతారన్నారు. జిల్లాలో అన్ని ప్రైమరీ హెల్త్ సెంటర్లు, హైస్కూల్స్, కాలేజీలు, అంగన్‌వాడీ సెంటర్లలో ఇప్పటికే గోడపత్రికలు ప్రదర్శించి అవగాహన కల్పించామన్నారు. 1 నుంచి 19 ఏళ్ల వయసు గల పిల్లలు, విద్యార్థులు ఆల్బెండోజోల్ మాత్రలు తీసుకోవాలని కోరారు. రెండేళ్లలోపు వారికి సగం మాత్ర, 2 నుంచి 19 ఏళ్ల వారికి ఒక మాత్ర వేసుకోవాలని కోరారు. 1 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు మాత్రను నీటిలో పొడి చేసి ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో అన్నిపీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు ఆల్బెండోజోల్ 400 ఎంజీ మాత్రలను పంపిణీ చేశామన్నారు. 4029 కేంద్రాల్లో విద్యార్థులకు ఈ మాత్రలు అందిస్తామన్నారు.

విస్ఫోటనం

- ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు
- మొత్తం 17 మందికి గాయాలు

సమయం : సోమవారం
ఉదయం 9.45 గంటలు..
అమలాపురం పట్టణంలోని 30వ వార్డు పరిధి రావులచెరువులో బాణసంచా తయారీదారుడు గొవ్వల నాగేశ్వరరావు నివాసం..
అందరూ ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు.. ఒక్కసారిగా భయంకరమైన శబ్దంతో పేలుడు.. మంటలు.. దట్టమైన పొగ.. ఏం జరిగిందోనని అంతా అలజడి.. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు, గోడలు కుప్పకూలాయి.. ఇంట్లో ఉన్న వారందరూ బయటకు పరుగులు పెట్టి ప్రాణాలు కాపాడుకోగా.. మోటారు సైకిళ్లు గాలిలోకి ఎగిరి రోడ్డున పడ్డాయి. రోడ్డుపై వెళ్లే వారికి.. చుట్టుపక్కల ఉన్న వారికి కూడా గాయాలయ్యాయి.. మొత్తం 17 మందికి గాయాలు కాగా.. అందులో తొమ్మిది మంది తీవ్రం గాయపడ్డారు. ఈ ఘటనతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉలిక్కిపడింది.

బాధసంచా..



పేలుడు ధాటికి ధ్వంసమైన గొవ్వాల సుభద్రమ్మకు చెందిన డాబా గోడ





తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరిన నాగేశ్వరరావు, నాగలక్ష్మి

- ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు
- కుప్పకూలిన ఇల్లు, గాల్లోకి ఎగిరిన మోటారు సైకిళ్లు
- మొత్తం 17 మందికి గాయాలు
- 9 మందికి తీవ్ర గాయాలు.., ఇద్దరి పరిస్థితి విషమం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- గ్యాస్ లీక్ వల్లే పేలుడు : మంత్రి వాసంశెట్టి సుభాష్

అమలాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీదారుడైన గొవ్వల నాగేశ్వరరావు(62) కొంత కాలంగా ఇంట్లోనే బాణసంచా తయారుచేస్తూ విక్రయాలు చేస్తున్నాడు. నివాస గృహాల మధ్య తయారుచేయడం ప్రమాదకరమని చుట్టుపక్కల వారంతా రెండు, మూడు పర్యాయాలు అతడికి చెప్పినావారి మాటలను లక్ష్య పెట్టలేదు. సోమవారం ఉదయం గ్యాస్ లీకై బాణసంచా సామగ్రి అంటుకుని విస్ఫోటం సంభవించినట్టు బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. ఇక్కడ వద్దని వారించినా వినకుండా తయారు చేయడం వల్లే ఈ ఘోరం జరిగిందని చుట్టుపక్కల వారు పోలీసు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు చెందిన భవనం పూర్తిగా కుప్పకూలింది. పక్కనే నివాసమున్న గొవ్వాల సుభద్రమ్మ ఇంటి గోడ పూర్తిగా ధ్వంసమైంది. అయితే సుభద్రమ్మ అంతకు ముందే పొలం వద్దకు వెళ్లడంతో బతికి బయటపడింది. పక్కింట్లో దుస్తులు ఉతుక్కుంటున్న దూనబోయిన సుబ్బలక్ష్మికి గాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్లేవారు, దగ్గరలో ఆడుకుంటున్న పిల్లలకి కూడా శకలాలు తగలడంతో గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఇంట్లో గ్యాస్ లీకై బాణసంచా పేలుడు సంభవించిందని కొందరు, బాణసంచా తయారు చేస్తున్న సమయంలోనే ఈ పేలుడు సంభవించి నల్లని పొగ ఆకాశంలోకి ఎగిసి పడడంతో ఆ ప్రాంత ప్రజలందరూ అయోమయానికి గురయ్యారనేది మరికొందరి ఆరోపణ.

క్షతగాత్రులు వీరే..

బాణసంచా విస్ఫోటంలో గొవ్వాల నాగేశ్వరరావు (62), నాగలక్ష్మి(55)లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి కుమారుడు గొవ్వాల యల్లేష్‌రాజు (25), యానాంకు చెందిన కుమార్తె కట్టా వేణు (35), మనుమడు వెంకట్, పక్కపక్క ఇళ్లకు చెందిన చొల్లంగి మారుతిసుబ్రహ్మణ్యం (20), పితాని శాంతి(26), బొక్కా మోహనప్రియ (11), దూనబోయిన సుబ్బలక్ష్మి (45), బొక్కా గీత గాయాలపాలయ్యారు. వీరందరూ కిమ్స్, అమలాపురం ఏరియా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బొక్కా మల్లి (12), పాటి దేవి (23), దూనబోయిన గాయత్రి(20), పాటి ప్రకాష్ (26), పాటి సుజాత(40), పాటి ప్రభాకరం(45)లకు స్వల్ప గాయాలు కాగా వారికి ప్రాథమిక చికిత్స నిర్వహించి ఇళ్లకు పంపేశారు.



రావులచెరువులో పేలుడు ధాటికి పూర్తిగా నేలమట్టమైన నాగేశ్వరరావు ఇల్లు

గ్యాస్ లీక్‌తో బాణసంచా పేలుడు : మంత్రి సుభాష్

రావులచెరువులో గ్యాస్ సిలిండర్ లీకవ్వడంతోనే బాణసంచా పేలుడు సంభవించిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. పేలుడులో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన తర్వాత ఆయన ఘటనా స్థలాన్ని సందర్శించారు. దేవుడి దయ వల్ల ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. లైసెన్సు లేకుండా బాణసంచా తయారు చేసేవారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రశాంత కోనసీమలో ఇటువంటి ఘటన జరగడం బాధాకరం. తక్కువ మోతాదుతో బాణసంచా తయారు చేసినా గ్యాస్ సిలిండర్ల ప్రభావం వల్ల భవనం నేలమట్టం అయ్యింది. ఆ చుట్టుపక్కల 150 మీటర్ల దూరం వరకు భవనాలు, అద్దాలు దెబ్బతిన్నాయి. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు వైద్య ఖర్చులు, ఇల్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందజేస్తామని మంత్రి ప్రకటించారు. ఎక్కడైనా ఇళ్ల మధ్య బాణసంచా తయారుచేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని అధికారులను కోరారు. మంత్రి వెంట పలువురు టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.



పేలుడు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

నలుగురు మైనర్ల అరెస్టు

10 ద్విచక్రవాహనాలు స్వాధీనం

కడియం, సెప్టెంబరు 16: మోటారుసైకిళ్ల దొంగతనం కేసులో నలుగురు మైనర్లను అరెస్టు చేసి వారిని రాజమహేంద్రవరం కోర్టుకు హాజరుపరుస్తున్నట్టు డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. సోమవారం కడియం పోలీస్‌స్టేషన్‌లో వారి వివరాలు మీడియాకు వెల్లడించారు. కడియం మండలంలో ఇటీవల జరుగుతున్న మోటారు సైకిళ్ల వరుస దొంగతనాలపై ప్రత్యేక పోలీసుబృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ నాగదుర్గాప్రసాద్‌కు వచ్చిన సమాచారం మేరకు చైతన్యనగర్ శివారు దొండుబాబు ఆలయం వద్దకు పోలీసుసిబ్బందితో వెళ్లగా నలుగురు మైనర్లు మోటారు సైకిళ్లపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని విచారించారు. ద్విచక్ర వాహన పత్రాలు పరిశీలించగా.. అవి చోరీకి గురైన మోటారుసైకిళ్లుగా వాటిని గుర్తించి, వారిని కడియం పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. పందలపాక, మామిడాడ గ్రామాలకు చెందిన కొంతమందితో బృందంగా ఏర్పడి కడియం, రాజానగరం, పెరవలి, పెద్దాపురం, సర్పవరం, రాజమహేంద్రవరం, యానాం పరిధిలో 10 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్టుగా గుర్తించామని వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న నలుగురు మైనర్లపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. పోలీసుసిబ్బంది కె.సురేష్‌బాబు, ఎం.సురేష్‌కుమార్, జి.రవికుమార్, కేవీ లక్ష్మణ్, శివకృష్ణ, బీమారావు, వై.రాహుల్, యూ.నాగబాబుకుమార్‌లు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

సత్య గృహోపకరణాల షోరూం ప్రారంభం

అందుబాటు ధరల్లో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులు



షోరూం ప్రారంభించిన దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 16: సత్య ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ వారి గృహోపకరణాలు షోరూం కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎండీ జీఎం జాన్సన్ ఆన్ శ్రీయా, జీఎం సెంథిల్ కుమార్, ఆనంద్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యా అంటే సంతోషమని, కస్టమర్లకు నాణ్యమైన వస్తువు సరసమైన ధరలకు అందించి కస్టమర్లకు సంతోషాన్ని, నమ్మకాన్ని అందించడం సత్య సొంతమన్నారు. ప్రొడక్ట్ హెడ్ భరత్ మాట్లాడుతూ 34వ షోరూంను కాకినాడలో ప్రారంభించామన్నారు. దేశవ్యాప్తంగా 277 షోరూమ్‌లు ఉన్నాయని, రాష్ట్రంలో 34 షోరూమ్‌లు ఉన్నాయని అన్నారు. రూ.30వేల పైబడి కొనుగోలు చేసిన వారికి బంగారు కాయిన్ ఇస్తామన్నారు.

విద్యార్థినులతో గుంజీలు తీయించిన ప్రిన్సిపాల్

- 50 మంది గిరిజన గురుకుల విద్యార్థినులకు అస్వస్థత
- రంపచోడవరం గురుకుల కళాశాలలో ఘటన
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- విచారణకు ఆదేశించిన ఐటీడీఏ పీఓ

రంపచోడవరం, సెప్టెంబరు1: రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు సుమారు 50 మంది సోమవారం అస్వస్థతకు గురై రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చేరారు. కళాశాల ప్రిన్సిపాల్ క్రమశిక్షణ పేరుతో విద్యార్థినులతో పెద్ద ఎత్తున గుంజీలు తీయించడంతో వారందరూ అస్వస్థతకు గురయ్యారు. తమ పిల్లలు అస్వస్థతకు గురయ్యారనే సమాచారం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు హుటాహుటిన కళాశాలకు చేరుకొని అనారోగ్య కారణాలపై ఆరా తీయగా ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని తెలిసింది. సీపీఎం జిల్లా కార్యదర్శి లోతారామారావు, నాయకులు మట్ల వాణిశ్రీ తదితరులు గురుకుల కళాశాలకు చేరుకుని అస్వస్థతకు గురైన విద్యార్థినులను అంబులెన్సులో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటన గురించి తెలుసుకున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం తక్షణం స్పందించి విచారణకు ఆదేశించారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కూడా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. తర్వాత గురుకుల కళాశాలను కూడా పరిశీలించి అక్కడ విద్యార్థినులతో మాట్లాడారు.

వినాయకా.. వీడ్కోలికా..

గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఊరూరా.. వీధి వీధినా కొలువుదీర్చిన బొజ్జగణపయ్యలకు భక్తులు ఘన వీడ్కోలు పలికారు.. వెళ్లిరా వినాయకా అంటూ సాగనంపారు. తీన్‌మార్ డప్పుల మోత మధ్య ఘనంగా నదీ, సముద్రతీరాలు, కాలువల వద్దకు తీసుకువెళ్లారు. నిమజ్జన కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

- కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం చాకలిపాలెంలో గణనాథుడిని రథంపై నిమజ్జనానికి తీసుకువెళుతున్న చిన్నారులు



కాకినాడలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు



రాజమహేంద్రవరం గోదారి గట్టు వద్ద వినాయక విగ్రహాలు



వినాయక నిమజ్జనాల వద్ద మహిళల నృత్యాలు



గోదావరి తీరాన గంగమ్మ ఒడిలోకి గణపయ్య..

ఇంటర్ విద్యార్థినులకు లైంగిక వేధింపులు

- గిరిజన సంక్షేమ వసతిగృహంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- బాధ్యుడైన ప్రధానోపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపించి సరిపెట్టిన వైనం
- గంగవరం ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఘటనపై ఆందోళనకు సిద్ధమవుతున్న గిరిజన సంఘాలు

రంపచోడవరం, సెప్టెంబర్16: అల్లూరి జిల్లా గంగవరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు అనుబంధంగా నడుస్తోన్న వసతిగృహంలో ఉంటున్న గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల గిరిజన విద్యార్థినులపై ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ ప్రధానోపాధ్యాయుడిపై క్రమశిక్షణ చర్యలతో పాటు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన నేరం కింద కేసు నమోదు చేయించడం మానేసి కేవలం డిప్యుటేషన్‌పై మంగంపాడు బాలికల ఆశ్రమ పాఠశాలకు పంపించి అధికారులు చేతులు దులిపేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల గిరిజన విద్యార్థినులకు వేరే ప్రత్యేక వసతిగృహం లేకపోవడంతో గంగవరంలోని ఆశ్రమపాఠశాల వసతి గృహంలోనే వీరికి వసతి కల్పించారు. దీంతో 10వ తరగతి విద్యార్థినులను పాఠశాల అయ్యాక చదివించే వంకతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిబంధనలకు విరుద్ధంగా బాలికల వసతిగృహంలోకి ప్రవేశించి అక్కడే ఉంటున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులపై కన్నేశాడు. వారి వద్దకు చేరి వారి పక్కనే కూర్చొని, వారిని లైంగికంగా వేధించడం మొదలు పెట్టాడు. తొలుత ఆయనను ప్రతిఘటించి వ్యతిరేకించిన విద్యార్థినులు తనకు సహకరించకపోతే ఇక్కడ వసతి ఉండదొన్న హెచ్చరికలతో ఆయన వేధింపులను విద్యార్థినులు భరిస్తూ వచ్చారు. కొంతకాలానికి వారిలో ధైర్యం వచ్చి తమపై జరుగుతున్న వేధింపులను వారి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు వివరించారు. ఆయన తక్షణం స్పందించి స్థానికంగా ఉన్న తహశీల్దారు, ఇతర ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో స్పందించిన ఐటీడీఏ అధికారులు గంగవరం తహశీల్దారు నుంచి వాస్తవాలను గ్రహించారు. తహశీల్దారు ప్రాథమిక విచారణలో విద్యార్థినులు మొత్తం విషయాలను వివరించారు. ఈ ఆశ్రమ పాఠశాలలో ఓ ప్రధానోపాధ్యాయుడు వసతి గృహంలోని ఇంటర్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడితే ఆయనను కేవలం డిప్యుటేషన్‌పై పంపించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూడటంతో పలు గిరిజన సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

చిక్కని చిరుత జాడ..

దివాన్‌చెరువు, సెప్టెంబరు16 : చిరుతపులి కదలికల జాడ సోమవారం ఎటువంటి సీసీ, ట్రాప్ కెమెరాల్లోనూ కనిపించలేదని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిరుతను ట్రాప్‌బోనులలో పట్టుకొనుటకు అదనపు బోనులను అమర్చి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం మేరకు వెళ్లి తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లభించలేదని, ప్రస్తుతం నివాసప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు నిర్ధారణ లేదని తెలిపారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, ఆటోనగర్, దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పిల్లలను సాయంత్రం ఆరు గంటలు దాటాక బయట తిరగకుండా చూడాలని తల్లిదండ్రులకు మరోసారి విజ్ఞప్తి చేశారు.

నరాలు తెగే ఉత్కంఠతో..

- ముగిసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు
- ఓవరాల్ చాంపియన్‌షిప్ గుంటూరు జట్టు
- సీనియర్ స్ట్రాంగ్ మెన్‌గా యశ్వంత్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 16: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యెనుముల కృష్ణపద్మరాజు, వంటెద్దు వెంకన్నాయుడు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సభకు మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో గుంటూరు జట్టు ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. విజయనగరం జట్టు ద్వితీయ స్థానం సాధించింది. హోరాహోరీగా సాగిన పవన్ లిఫ్టింగ్ పోటీల్లో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో స్ట్రాంగ్‌మెన్ టైటిల్ విన్నర్స్‌గా పి.జాన్‌బాబు (కృష్ణ), బి.యశ్వంత్‌కుమార్ (కోనసీమ), పి.దినేష్ (అనకాపల్లి) వరుస స్థానాలు సాధించారు. జూనియర్ మెన్ విభాగంలో ఎస్.శరత్ (పల్నాడు), ఎస్.బాలసాయిచరణ్ (అనకాపల్లి), జె.లవకుమార్ (అనకాపల్లి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా కె.యశ్వంత్ (విశాఖ) నిలవగా కేవీవీఎస్పీ ప్రసాద్ (అనకాపల్లి) ద్వితీయ, ఎన్.శరత్ (పల్నాడు) తృతీయ స్థానాలు సాధించారు. మెన్స్ విభాగంలో వేర్వేరుగా నిర్వహించిన పోటీల విజేతల వివరాలతోపాటు టీమ్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను బాలాజీ విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు, యేడిద శ్రీను, చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు, వంటెద్దు బాబి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, చిక్కం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ సాధించిన గుంటూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నందెపు బాలాజీ



స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా నిలిచిన యశ్వంత్

మనస్పర్థలొద్దు.. మనందరం ఒకటే

- కూటమి ఐక్యతను దెబ్బతీసే పనిలో దుష్టశక్తులు
- కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతులతో మంత్రి వాసంశెట్టి సుభాష్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16: మనస్పర్థలు వద్దు.. మనందరం ఒకటేనని, కూటమి ఐక్యతను దెబ్బతీసేందుకు కొన్ని దుష్టశక్తులు పని చేస్తున్నాయని, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు అహర్నిశలు పాటుపడుతున్నారని, వారి స్ఫూర్తితోనే అందరూ కలసికట్టుగా కాకినాడ రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం ఆయన కాకినాడ రూరల్ మండలం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతుల నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి పిల్లి దంపతులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను పరిచయం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి సుభాష్ మాట్లాడారు. అనంతరం మంత్రి సుభాష్ విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీలో అత్యంత సీనియర్ నాయకులు పిల్లి దంపతులని, పార్టీ పొత్తులో భాగంగా కూటమి అభ్యర్థి గెలుపు కోసం విశేష కృషి చేశారన్నారు. పార్టీ కష్టకాలంలో టీడీపీ వెన్నంటే ఉన్న చరిత్ర పిల్లి దంపతులదని కొనియాడారు. నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య మనస్పర్థలు ఉన్నట్లు తెలిసిందని, వీటిని పరిష్కరించేందుకు ఇక్కడికి వచ్చానని, ముందుగా పిల్లి దంపతులతో మాట్లాడానని వెల్లడించారు. కూటమి ఎమ్మెల్యే పంతం నానాజీ అందుబాటులో లేకపోవడంతో మరోసారి వచ్చి ఆయనతో మాట్లాడతానని తెలిపారు. కూటమి ఐక్యతను దెబ్బతీసే విధంగా కొంత మంది ప్రత్యర్థులు ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నారని టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. తనకు ఎమ్మెల్యే పంతం నానాజీకి మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి కూటమి నాయకులతో కలసి పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంపర ఏఎంసీ మాజీ చైర్మన్ కర్రి వెంకట్రాజు, మాజీ జడ్పీటీసీ బుంగాసింహాద్రి, మాజీ డిప్యూటీ మేయర్ కాళ్ల సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు పలివెల త్రిమూర్తులు, పాలిక ఉషారాణి, మాతా లక్ష్మణ్, తాతపూడి రామకృష్ణ, చొక్కా జగన్, పితాని అప్పన్న, మరుకుర్తి నాగబాబు, పిల్లి బుజ్జి, పిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సుభాష్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి దంపతులు

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 16: సోమవారం ప్రభుత్వ సెలవు కారణంగా వాయిదా పడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్ భావన తెలిపారు. నగరపాలకసంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30 నుంచి డయల్ యువర్ కమిషనర్ తదుపరి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామన్నారు.

'ఇంజనీర్లు కూడా సామాజిక సేవలో పాల్గొనాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 16: ఇంజనీర్లు కూడా సామాజిక సేవలో పాల్గొనాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి ఛాన్సలర్ మురళీకృష్ణ అన్నారు. కాకినాడ కాస్మోపాలిటిన్ క్లబ్ సమావేశ మందిరంలో లయన్స్‌క్లబ్ కాకినాడ ఎలైట్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు ఎంఎస్ఆర్‌వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి చాన్సలర్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమైందన్నారు. క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ మనం ఉపయోగించే ప్రతి పరికరం వెనుక ఒక ఇంజనీర్ సృష్టి ఉందన్నారు. ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న డాక్టర్ బాదం బాలకృష్ణ, ముంజులూరి విశ్వేశ్వరరావు ప్రసంగించారు. జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఎలక్ట్రికల్ ఈఈ శ్రీఉదయ్‌భాస్కర్, శాస్త్రి, మంగరాజు, కిషోర్‌కుమార్, ఫణేంద్ర, వేణుగోపాల్ తదితర 12మంది ఇంజనీర్లను శాలువాలతో సత్కరించారు. క్లబ్ సంయుక్త కార్యదర్శి పివి రాఘవరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

పెద్దాపురం, సెప్టెంబరు 16: స్థానిక వరహాలయ్యపేటలో ఇంజనీర్స్ డే వేడుకలను పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భారత ఇంజనీరింగ్ పితామహుడు, భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పీసీసీ ప్రతినిధులు బుద్దా శ్రీనివాస్, కూనిరెడ్డి అరుణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, ఆయన అడుగు జాడల్లో నేటి ఇంజనీర్లు పయనించాలన్నారు. కార్యక్రమంలో డిప్లమా, పాలిటెక్నిక్ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

'ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు'

పెద్దాపురం, సెప్టెంబరు 16: సీపీఎం అఖిల భారత కార్యదర్శి సీతారామ్ ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషబాబ్జీ అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో సీపీఎం పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి శేషబాబ్జీతోపాటు ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏచూరి అత్యంత చిన్నవయసులో కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడిగా, అఖిలభారత కార్యదర్శి స్థాయికి ఎదిగారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దారపురెడ్డి క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, మంతెన సత్తిబాబు, దాడి బేబీ తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అఖిలపక్ష సమావేశం

సామర్లకోట, సెప్టెంబరు 16: త్వరలో జరగనున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు గతంలో పాత తహశీల్దార్ కార్యాలయాన్ని పోలింగ్‌స్టేషన్‌గా వినియోగించగా నేడు సదరు భవనం శిథిలావస్థకు చేరినందున ఆ స్థానంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని వినియోగించే ప్రతిపాదనలు ఉన్నట్టు తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఇందుకు అఖిలపక్ష కమిటీ నిర్ణయాన్ని సేకరించడంతో మెజార్టీ పార్టీల నాయకులు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో నిర్ణయాన్ని కలెక్టర్ ఆమోదం కోసం నివేదికలు పంపనున్నట్టు తహశీల్దార్ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాస్, వీఆర్వోలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్!

పెద్దాపురం, సెప్టెంబరు 16: స్థానిక వరహాలయ్యపేటలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న సమాచారంతో పోలీసులు దాడి చేసి 9 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు, వారి నుంచి రూ.2,44,790 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పట్టుబడ్డ నగదు విషయంలో పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. నగదు సుమారు సుమారు రూ.5 లక్షల పైబడి ఉంటుందని తెలుస్తోంది. నగదు పక్కదారి పట్టిందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. అలాగే పేకాటరాయుళ్ల అరెస్టును పోలీసులు ఎందుకు రహస్యంగా ఉంచారని వారితీరుపై పలు విమర్శలు వెల్లువెత్తాయి.

ఏకమ్, అనేకమ్ పుస్తకాల ఆవిష్కరణ

పెద్దాపురం, సెప్టెంబరు 16: స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో సాహితీ స్రవంతి, ఏనుగు లక్ష్మణకవి పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఎర్రమిల్లి నాగేశ్వరావు, తాడిగడప సుబ్బారావు రచించిన ఏకమ్ అనే పుస్తకాన్ని, ఎర్రమిల్లి వెంకటరామ అనంత సత్యప్రసాద్ రచించిన అనేకమ్ అనే పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ప్రముఖ సహస్రావధాని కడిమిళ్ల వరప్రసాద్ చేతులమీదుగా నిర్వహించారు. ఈ 2 పుస్తకాల సారాంశాన్ని పలువురు సాహితీవేత్తలు వివరించారు. రచయితలను పూలమాలలు దువ్వాలువాలతో సత్కరించారు. కుంటముక్కల సత్యవాణి, రాజేశ్వరి, గురులింకల ధర్మరాజు, శ్రీవత్స సలాది సాయి, మిరియాల జయశ్రీ, దర్భా వెంకటేశ్వరశర్మ, బి.సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న గుర్తుతెలియని కారు

తాళ్లరేవు, సెప్టెంబర్ 16: జైభీమ్‌పేట వైజంక్షన్ 216 జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని కారు ఢీకొందని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. పోలేకుర్రు పంచాయతీ పరిధి జైభీమ్‌పేట వైజంక్షన్ 216 జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి యానాం నుంచి తాళ్లరేవుకు ద్విచక్రవాహనంపై వైదాడి దుర్గాప్రసాద్ కుటుంబసభ్యులతో ప్రయాణిస్తుండగా వెనుకనుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొని వెళ్లిపోయింది. దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు స్వల్పగాయాల పాలయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేదలకు ఉచిత భోజనం

జగ్గంపేట, సెప్టెంబరు 16: కాకినాడ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో గండేపల్లి మండలం ఉప్పలపాడు మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ అడబాల కుందరాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు అడబాల రామాంజనేయులు ఆర్థిక సాయంతో పేదలకు ఉచిత భోజనం అందించారు. టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అడబాల భాస్కరరావు, సేవా నరసింహమూర్తి, బొల్లం రెడ్డి రామకృష్ణ, వెంపాటి రాజు, పైలా వెంకన్న తదితరులు ఉన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

సామర్లకోట, సెప్టెంబరు 16: స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకూ జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మండలంలో హుస్సేన్‌పురంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో మండల అధికారులు ఈ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వభావ, స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛ ఇతివృత్తంగా స్వచ్ఛ హీ సేవా 2024ను నిర్వహిస్తున్నారని ఎంపీడీవో డి.శ్రీలలిత చెప్పారు. మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, వైద్యఆరోగ్య శాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు, స్వచ్ఛత పరుగులు, బ్లీచింగ్, దోమల నివారణ, మందుల పిచికారీ, నీరు నిలిచే ప్రదేశాలను శుభ్రపరచడం తదితర కార్యక్రమాలు ప్రజా భాగస్వామ్యంతో నిర్వహించనున్నట్టు ఆమె పేర్కొన్నారు.

'చేసిన సేవలతో సమాజంలో గుర్తింపు'

కరప, సెప్టెంబరు 16: ఎంచుకున్న రంగంలో చేసిన సేవలే సమాజంలో గుర్తింపును తీసుకువస్తాయని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ పేర్కొన్నారు. విద్యా సామాజిక సేవారంగాల్లో విశేష కృషిచేస్తూ తెలుగు వెలుగుల జాతీయ పురస్కారం-2024కు ఎంపికైన యండమూరు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఎం.ఎ.అలీమ్‌ను వారు అభినందించారు. చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా అలీమ్ చేస్తున్న సేవాకార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపికవడం గర్వకారణమన్నారు. నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ విజయవాడ ఈ జాతీయ పురస్కారాన్ని అలీమ్‌కు అందజేశారు. చేయూత సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మొండి రవికుమార్, ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు షేక్ వల్లీ భాషా, ఉపాధ్యాయులు, అలీని అభినందించారు.

పవర్ లిఫ్టింగ్‌లో హెడ్‌కానిస్టేబుల్‌కు గోల్డ్ మెడల్

గండేపల్లి, సెప్టెంబరు 16: అమలాపురంలో ఈనెల 15న జరిగిన 11వ ఏపీ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 400 కిలోల మాస్టర్ పవర్ లిఫ్టింగ్ కేటగిరీలో గండేపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జీఎస్ఎన్ మూర్తి (బైసన్) గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే బెంచ్ ప్రెస్ విభాగంలో సైతం మూర్తి గోల్డ్ మెడల్ సాధించడంతో గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, స్నేహితులు అభినందించారు.

తీరనున్న కొత్తపల్లి ప్రజల తాగునీటి సమస్యలు

కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి శ్రీకారం

కొత్తపల్లి, సెప్టెంబరు 16: నాగులాపల్లి ఏరియా సమగ్ర గ్రామీణాభివృద్ధి రక్షిత మంచినీటి పథకం ద్వారా కొత్తపల్లి మండల ప్రజల తాగునీటి సమస్యలు తీరనున్నాయి. తరచూ ప్రధాన పైప్‌లైన్ లీకులతో రోజుల తరబడి తాగునీటికి ఇబ్బందులకు లేకుండా ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా వాకతిప్పలో ఉన్న రక్షిత మంచినీటి పథకంనుంచి ఉప్పాడ వరకు ఉన్న 4కిలోమీటర్ల ప్రధాన రహదారి వెంబడి కొత్తపైప్ ఏర్పాటుకు ఆర్‌డబ్ల్యుఎస్ రూ.7 కోట్లు మంజూరు చేసింది. దాంతో 4కిలోమీటర్ల మేర నాణ్యమైన నల్లటి పైప్‌లను కొనుగోలు చేశారు. వాటిని త్వరలో పాత ప్రధాన పైప్‌లైన్ చేరువగా ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. త్వరితగతిన పైప్‌లైన్ నిర్మాణం పూర్తయ్యి నిరంతరం తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బై బై గణేశా..!



పిఠాపురం, కరపలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



గొల్లప్రోలు రూరల్: తాటిపర్తిలో వినాయకుడి టీషర్టులతో యువత, కొత్తపల్లి: ఉప్పాడలో యువకులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16: వినాయక నవరాత్రుల ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమం వేలాది మంది భక్తుల నడుమ కన్నుల వైభవంగా సాగింది. మండలంలోని పలు గ్రామాల్లో వాడవాడలా ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన వినాయక ప్రతిమలను ఆటోలు, వేన్‌లు, ట్రాక్టర్ల ద్వారా సూర్యారావుపేట తీరానికి తీసుకొచ్చి సముద్రంలో ఘనంగా నిమజ్జనం చేశారు. నిమజ్జనం ఏర్పాట్లను కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, మెరైన్ సీఐ రామోహ్మన్‌రెడ్డి, తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. నగర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వాహకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

సామర్లకోట: జీ.మేడపాడులో గణపతి ఆలయం వద్ద పాలకుర్తి శ్రీనుబాబు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజలకు ఎమ్మెల్యే చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు హాజరయ్యారు. ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని వారు వడ్డించి ప్రారంభించారు. వేట్లపాలెం గణపతి ఉత్సవ మందిరం వద్ద పూజల్లో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు. పట్టణంలో లారీ స్టాండ్ యూనియన్, లక్ష్మీనందనకాలనీ, నిమ్మతోట పార్క్‌లో గణపతి ఉత్సవ పందిళ్ళ వద్ద గణపతిని రాజప్ప, తుమ్మల దర్శించుకుని పూజలు చేశారు.

పిఠాపురం: పట్టణంలో గణేష్ నిమజ్జనాలు సోమవారం కొనసాగాయి. బాణసంచా కాలుస్తూ మేళ తాళాలతో శోభాయాత్ర నిర్వహించారు. చిన్నవిగా విగ్రహాలను పిఠాపురం శివారులో ఉన్న ఏలేరు, పీబీసీ కాలువల్లో.. భారీ విగ్రహాలను ఉప్పాడ సముద్ర తీరానికి తీసువెళ్లి నిమజ్జనం చేశారు. ఆయా వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. యువకులు పరస్పరం రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. నిమజ్జనం చేసే ప్రాంతాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయక మందిరాల వద్ద అన్నదానం చేశారు.

పిఠాపురం రూరల్: మండలంలోని విరవ, విరవాడ, గోకివాడ, రాపర్తి, రాయవరం, మాధవపురం, నవఖండ్రవాడ తదితర గ్రామాల్లో నిలపిన వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై నిమజ్జనానికి తరలించారు.

కరప: మండలంలోని అరట్లకట్ట, పెనుగుదురు, గొర్రిపూడి, వేళంగి, ఉప్పలంక గ్రామాల్లోని కాలువల్లో స్వామివారిని నిమజ్జనం గావించారు. ఆయా మండపాల వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించగా యువకులు ఉత్సాహంగా పాటలో పాల్గొన్నారు. 9 రోజుల బాటు భక్త నీరాజనాలందుకున్న గణనాదుడికి నిమజ్జన ఘట్టంతో తుది వీడ్కోలు పలికారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలులో వివిధ ప్రాంతాల్లో నిలిపిన వినాయకుడి భారీ విగ్రహాలను ప్రదర్శనగా ఉప్పాడ వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు. చిన్న విగ్రహాలను గోదావరి కాలువలో నిమజ్జనం చేసి భక్తులు స్నానాలు చేశారు. అన్నదానాలు జరిగాయి.

గ్రామాల్లో వేడుకగా గణేష్ నిమజ్జనోత్సవం

గొల్లప్రోలు రూరల్: మండలంలోని చేబ్రోలు, దుర్గాడ, తాటిపర్తి, వన్నెపూడి, చినజగ్గంపేట తదితర గ్రామాల్లో వినాయక శోభాయాత్రలు ఘనంగా జరిగాయి. తాటిపర్తి ఈతతోట గణపతి నిమజ్జనోత్సవంలో భక్తులు అధికంగా పాల్గొన్నారు. అపర్ణా ముఖద్వారం వద్ద నిలిపిన యువగణపతికి 108 కిలోల అన్నంతో మహాకుంభ నివేదన చేశారు. ఈతతోట గణపతి నిమజ్జనోత్సవంలో యువకులు ధరించిన టీషర్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీరంతా వినాయకుడి ఫోటోలు ప్రింట్ చేసి ఉన్న ఒకే రకం టీషర్టు ధరించి నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలో పలు గ్రామాల భక్తులు గణనాథులను నిమజ్జనం చేసేందుకు ఉప్పాడ బీచ్ రోడ్డుకు భారీ ఊరేగింపుగా తరలివెళ్లారు. కొత్తపల్లి నుంచి ఉప్పాడ వరకు ట్రాక్టర్లు ర్యాలీలుగా తరలి వెళ్లాయి. బీచ్‌రోడ్డులో సుబ్బంపేట, కోనపాపపేట, రమణక్కపేటలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఏలేశ్వరం: పట్టణంలో తోట వీధి, మార్కెట్, మెక్కారావు కాలనీ, పెద్దవీధి, చైతన్య నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహాలను డీజేసౌండ్, బాణసంచాలతో మహిళలు, చిన్నారులు ఊరేగింపుగా తీసుకెళ్లి ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ప్రమాదాలకు తావులేకుండా పోలీసులు, గజఈతగాళ్లను ఏర్పాటుచేసినట్టు ఎస్ఐ రామలింగేశ్వరరావు చెప్పారు.

జగ్గంపేట: స్థానిక గోకవరం రోడ్డులో గల శ్రీ గణేష్ కృష్ణ టాక్సీ స్టాండ్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముర సత్తిబాబు ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద 5వేల మందికి మహా అన్న సమారాధన నిర్వహించారు. యూనియన్ సభ్యులు ఎ.లోవరాజు, ఉప్పులూరి రామకృష్ణమేడిపోయిన వెంకటేష్, కొత్త శేషు, మండపాక శశికుమార్, రాజాన సతీష్, మద్దూరి రమణ పాల్గొన్నారు.

కిర్లంపూడి: గెద్దనాపల్లి కుమ్మరాలలో శ్రీవరసిద్ధి వినాయక మహోత్సవాల యూత్ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. గెద్దనాపల్లి సర్పంచ్ మొల్లేటి గంగాభవానీ, ఎంపీటీసీ బొడ్డేటి నాగలక్ష్మి, మొల్లేటి గంగాధర్ పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండంలో అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి గోవలంక, పిల్లంక, అరటికాయలంక, నందిరేవు, గోల్లలరేవు, సీతారామపురం రేవుల్లో నిమజ్జనాలు చేశారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు, ధర్మవరంలలో వినాయక విగ్రహాల ఊరేగింపుల్లో పెద్ద ఎత్తున యువత, యువకులు పాల్గొని స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. బావిశెట్టి వారి వీధి మండపం వద్ద నిర్వహించిన అన్నదానంలో భారీగా భక్తులు పాల్గొన్నారు.

పోర్టుసిటీ(కాకినాడ): కాకినాడ టూటౌన్ సమీపంలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద శ్రీగణపతి యువ బాల భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా త్రిముఖ మట్టి వినాయకుడి విగ్రహం నిమజ్జనం నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ తలాటం హరీష్ అన్నపూర్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ఇళ్ల మధ్య నుంచి కరెంటు లైన్ తొలగించాలి'



తుమ్మలపల్లికి వినతి అందజేస్తున్న గ్రామస్తులు

జగ్గంపేట, సెప్టెంబరు 16: జగ్గంపేట మండలం కాండ్రేగుల వినాయకనగర్‌లో ఇళ్ల మధ్య నుంచి 11కేవీ కరెంటు లైన్ తొలగించే విధంగా కృషి చేయాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్‌ను ప్రజలు కోరారు. కాలనీలో 11కేవీ లైన్‌లు చేతికందే విధంగా ఉండటం వల్ల జనం ఇబ్బంది పడుతున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని, గతంలో ఒక ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడని తెలిపారు. గత 10ఏళ్ల నుంచి ఎమ్మెల్యేల చుట్టూ తిరిగామని మా సమస్య తీరలేదన్నారు. తుమ్మలపల్లి వెంటనే స్పందించి ఎలక్ట్రికల్ డీఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. త్వరగా ఈ 11కేవీ కరెంట్‌లైన్‌ను ఇళ్ల మధ్య నుంచి కాకుండా వేరే ప్రదేశం నుంచి పంపే విధంగా చేయాలని కోరగా డీఈ సానుకూలంగా స్పందించారు.

రహదారి నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు

కిర్లంపూడి, సెప్టెంబర్ 16: కొత్త కృష్ణవరం నుంచి పాత కృష్ణవరం ప్రధాన రహదారి నిర్మాణానికి సుమారు రూ.50లక్షలు మంజూరయ్యాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. పాత కృష్ణవరంలో సోమవారం ఏలేరు వరద బాధితులకు 25 కిలోల బియ్యం, కందిపప్పు, బంగాళాదుంపలు, మంచినూనె, ఉల్లిపాయలు, పంచాదార వంటి నిత్యావసరాలు పంపిణీ చేశారు. కృష్ణవరం టీడీపీ నాయకుడు బొదిరెడ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నెహ్రూ విచ్చేశారు. ముంపు బాధితులకు రూ.10వేలు, దుస్తులు, రైతులకు ఎకరానికి రూ.10వేలు అందించడం జరుగుతుందన్నారు. ఇర్రిపాక నుంచి ముక్కొల్లు వరకు వరద గ్రామాల్లోకి రాకుండా రక్షణ గోడ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, మారిశెట్టి భద్రం, తహశీల్దార్ చిరంజీవి, కుంచే తాతాజీ, పాటంశెట్టి మురళీకృష్ణ, కర్నాకుల పెదకాపు స్వామి, బీజేపీ మండలాధ్యక్షుడు యడలా రాంబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి సేవా పక్షోత్సవాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం నుంచి నియోజకవర్గంలో చేపట్టే సేవా పక్షోత్సవాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు పిలుపునిచ్చారు. మండలంలోని యుజజేపురంలో సోమవారంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, పాఠశాలల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు, స్వాతంత్ర సమర యోధుల విగ్రహాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బీజేపీ నాయకులు ఊటా వీరబాబు, కూరాకుల రాజా, బాలిపల్లి చక్రి పాల్గొన్నారు.

రౌతులపూడి: రౌతులపూడిలో బీజేపీ మండలాధ్యక్షుడు ఉటా నాగశ్రీను అధ్యక్షతనత విలేకర్ల విలేకర్లు సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు సేవా పక్షోత్సవాలపై వివరించారు.

ఏలేశ్వరం: బీజేపీ పట్టణాధ్యక్షుడు రెడ్డి లోవరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు, నాయకులకు మెక్కారావు కాలనీలో సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ అక్టోబర్ 2వరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు, మొక్కలు నాటడం చేపట్టాలన్నారు.

మహమ్మద్ ప్రవక్త కారణజన్ముడు

» కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు » భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



కాకినాడ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు, ఏలేశ్వరంలో కేక్ కట్ చేస్తున్న ముస్లింలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 16: ప్రపంచంలో శాంతిపూర్వక మానవ సమాజాన్ని నెలకొల్పేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. నగరంలో ముస్లింలు సోమవారం నిర్వహించిన మిలాద్-ఉన్-నబీ ర్యాలీలో ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముందుగా మత గురువు ఇమామ్ సాహెబ్‌ను శాలువాతో సత్కరించారు. మైనారిటీ నాయకులు ఎంఏ తాజుద్దీన్, ఎస్‌కే రహీమ్, ఎండీ అన్సర్, ఎండీ ఖాన్, ఆశీఫ్ ఆలీ, ఎంఏ సయ్యద్, సయ్యద్ ఆలీ, ఎండీ కస్మూర్, అన్వర్, జరుల్లాఖాన్, కరీముల్లా, ఖాదర్‌వలీ ఖాన్ ఉన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో మసీదులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. పుర వీధుల్లో భారీ నిర్వహించారు. మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. బాలాజీ చౌక్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపీ పాల్గొని కేక్ కట్‌చేసి స్థానికులకు పంచారు.

జగ్గంపేట: జగ్గంపేటలో మసీదు కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మసీదు వద్ద నుంచి జగ్గంపేట అంతా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ గౌరవ అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు మాజీ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ గఫూర్, మాజీ డైరెక్టర్ ఎస్‌కే సయ్యద్‌బాబ్జి, షేక్ సలీం, ఎండీ బాబు, ఎండీ కాజా, నూతన కమిటీ అధ్యక్షుడు షేక్ ఆరిఫ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ భాష, సెక్రటరీ ఎస్‌కే రెహమాన్, ట్రెజరర్ షేక్ మొహిద్దీన్, షేక్ ఇబ్రహీం, షేక్ వలీ పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెంలో ఆదిత్యలో ఆధ్యాత్మిక ప్రాంగణంలోని మసీదు నందు మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం విద్యార్థులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దాపురం: పట్టణంలో కవాడీ వీధిలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి శాంతి, సౌభ్రాతృత్వాలను సోదరభావాన్ని బోధించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో రాజప్ప ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 16: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజప్పకు ఆలయ పండితులు సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా కాలభైరవస్వామిని దర్శించి ఆలయ ఆవరణలో అన్ని ఉపాలయాల దేవతా మూర్తులను దర్శించారు. గోలివెంకటఅప్పారావు చౌదరి చినరాజప్ప పేరిట మొక్కుబడిలో భాగంగా 200 కొబ్బరికాయలు కొట్టి మొక్కుతీర్చుకోగా తొలి కొబ్బరికాయను ఎమ్మెల్యే కొట్టి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వరస్వామికి విశేష అభిషేకపూజలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నంది మండపం వద్ద పండితుల వేదస్వస్తి అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల కార్యాచరణ ప్రణాళికలను సమీక్షించారు. భీమేశ్వర అన్నదాన ట్రస్ట్ ఆవరణలో ట్రస్ట్ ప్రతినిధులు బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, చంద్ర గోపాలకృష్ణ, ఆర్వీ.సుబ్బరాజుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అల్పాహార విందులో ఎమ్మెల్యే టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆలయ ఈవోపై ఎమ్మెల్యే ఆగ్రహం

ఆలయ ఆవరణలో భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించకపోవడం, తమ పార్టీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా చలనం లేకపోవడం విడ్డూరంగా ఉందని పాత ప్రభుత్వంలో పనిచేసినట్టు చేస్తే కుదరదు, పద్ధతి మార్చుకోండి అంటూ భీమేశ్వరాలయ ఈవో బళ్ళ నీలకంఠంపై ఎమ్మెల్యే చినరాజప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమే శ్వరాలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేయనున్నందున ఆలయ ముఖద్వారానికి సమీపంలో గోదావరి కాలువ ఒడ్డున తలుపుల అంజన్‌కుమార్ కుటుంబీకులచే నిర్మించిన రిక్వెస్ట్ బస్టాప్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

బాధితులందరినీ ఆదుకుంటాం

జిల్లాలో ఏలేరు వరదల కారణంగా నీట ముంపులో పంటలు నష్టపోయిన రైతులు, ఆస్తులు కోల్పోయిన ప్రజలను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకునేందుకు కారాచరణ ప్రణాళికలు సిద్ధం చేసిందని, ఈ విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎంత మాత్రం నమ్మవద్దని ఎమ్మెల్యే రాజప్ప పేర్కొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత : డీవైఈవో



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 16: ఓజోన్ పొర పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని కాకినాడ డీవైఈవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా కాకినాడ బీఆర్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి(ఆప్‌కాస్ట్), పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు పర్యావరణంపై వ్యాసరచన, చిత్రలేఖనం, డిబేట్, ఏకపాత్రాభినయం పోటీలను సోమవారం నిర్వహించారు. ఆప్‌కాస్ట్ సభ్య కార్యదర్శి బీవీఏ కృష్ణమూర్తి ఆదేశాల మేరకు నిర్వహించినట్టు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లాసమన్వయకర్త కేసరిశ్రీనివాసరావు తెలిపారు. 54 పాఠశాలల నుంచి 386 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఓజోన్ పొరను రక్షించుకుని భూగోళాన్ని కాపాడుకుందామని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ, పిల్లి గోవిందరాజులు, కె.పాల్‌రాజు, శిరీషా పాల్గొన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా కాకినాడ శ్రీనగర్‌లో యంగ్‌మైండ్స్ రేపటి కోసం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓజోన్ పొర పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ సంస్థ సభ్యులు, సామాజిక వేత్తలు పాల్గొన్నారు.

ఆదిత్యలో....

గండేపల్లి: సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. మెకానికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.భీమేశ్వరరెడ్డి, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూట గంగాధర్, పి.నాగేశ్వరరావు, రామ్‌ప్రసాద్ మొక్కలు నాటారు.

మూలగపూడిలో డయేరియా



చికిత్స పొందుతున్న రోగులు

రౌతులపూడి, సెప్టెంబరు 16: మూలగపూడి గ్రామంలోని ఎస్సీకాలనీలో ఆరుగురు డయేరియా బారినపడ్డారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నవారికి స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సౌందర్య, సరోజ వైద్యసేవలందించారు. ఓ ఫంక్షన్‌లో తిన్న ఫుడ్ వల్లే డయేరియా వచ్చినట్టు వైద్యులు తెలిపారు. గ్రామంలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటింటా సర్వే జరిగింది.

అరుణాచలం యాత్రకు స్పెషల్ బస్సు

కార్పొరేషన్, సెప్టెంబరు 16: కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి స్పెషల్ బస్సు సోమవారం ఉదయం 12 గంటలకు డీఎం ఎంయువీ మనోహర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కాణిపాకం, శ్రీపురం దర్శనం తర్వాత అరుణాచలం వెళ్లి అక్కడ గిరిప్రదక్షిణ పూర్తయిన తర్వాత కంచి తీసుకెళ్లి ఆ తర్వాత కాళహస్తి దర్శనం పూర్తయిన తర్వాత 20వతేదీ రాత్రి 10 గంటలకు కాకినాడ చేరుతుందన్నారు.

బ్యూటీషియన్ కోర్సు ప్రారంభం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 16: మహిళలు జీవితంలో స్థిరపడడానికి బ్యూటీషియన్ వృత్తి ఎంతగానో ఉపయోగపడుతుందని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్, డిస్ట్రిక్ట్ మెంటార్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. మెయిన్‌రోడ్‌లోని ఓ బ్యూటీ స్కూల్‌లో సోమవారం లయన్స్‌క్లబ్ శ్రీకారం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బ్యూటీషియన్ కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. దీనికి లయన్స్ క్లబ్ సఖి అధ్యక్షురాలు కొడాలి ఉమాదేవి అధ్యక్షత వహించారు.

వరద బాధితులకు బియ్యం, దుస్తులు

గండేపల్లి, సెప్టెంబర్ 16: విజయవాడ వరద బాధితులకు గండేపల్లి గ్రామస్తులు బియ్యం, దుస్తులు సేకరించి సోమవారం పంపించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సుబ్బారావు, ఎలుగంటి నాగేశ్వరరావు, మధు, చిక్కాల కృష్ణ ఉన్నారు.

సీఆర్ఎమ్‌టీ అధ్యక్షుడిగా తరాల

తాళ్లరేవు, సెప్టెంబరు 16: సీఆర్ఎమ్‌టీ డబ్ల్యు సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా తాళ్లరేవు మండల విద్యాశాఖలో పనిచేస్తున్న తరాల మీరాసాహెబ్ ఎంపికయ్యారు. ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీవో అనుపమ, ఎంఈవోలు మంగాయమ్మ, ఉమా, ఉపాధ్యాయ సంఘాలు అభినందించారు.

లక్ష్మీగణపతి శాంతి కల్యాణం



గణపతికి కరెన్సీతో అలంకరణ

కిర్లంపూడి, సెప్టెంబర్ 16: కిర్లంపూడి సంత మార్కెట్‌లో లక్ష్మీగణపతి శాంతి కల్యాణం వేద పండితులు బాదంపూడి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. స్వామికి రూ. 2.50 లక్షలతో అలంకరణ చేశారు. 9రోజుల పాటు నవరాత్రి మహోత్సవాలను రోజుకొక అలంకరణలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సహకారంతో ఏర్పాటు చేశారు.

ఉప్పలపాడులో అన్నసమారాధన

గండేపల్లి, సెప్టెంబర్ 16: ఉప్పలపాడులో శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద జనసేన నాయకులు మేడిబోయిన శ్రీను బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, మాదారపు వీరబాబు, సత్తి సోమరాజు, అంకం ఓం, కాయల మణికంఠ పాల్గొన్నారు.

రూ. 1.07 లక్షలకు గణపతి లడ్డూ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 16: వినాయక నవరాత్రి మహోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం రాత్రి రమణయ్యపేట జ్యూయల్ మెడోస్ గేడెడ్ కమ్యూనిటీలో శ్రీ సిద్ధి గణపతి ఆలయంలో స్వామివారి లడ్డూకు నిర్వహించిన వేలంలో ఆర్ఆర్ఆర్ గ్రూపు మహిళలు రూ.1.07 లక్షలకు పాడి ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. పాటలో లడ్డూలను కంతేటి రాజీ, వనమా మరిడిరాజు, ఆర్ఆర్ఆర్ గ్రూపు, వైష్ణో దేవి గ్రూప్ మహిళలు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అడపా బాబు, వైస్ చైర్మన్ గౌతు రాజు, జ్యూయల్ మెడోస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కంతేటి శ్రీనివాస్, ఏఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.



లడ్డూను దక్కించుకున్న జ్యూయల్ మెడోస్ మహిళలు